క్లుప్తంగా

ఓటు హక్కుపై అవగాహన


మాట్లాడుతున్న సీఐ మధు

మధిర: ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని మధిర తహసీల్దార్ వి.వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, మధిర సీఐ మధు కోరారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శుక్రవారం మధిర పట్టణంలో బైక్ ర్యాలీ, సెల్ఫీ విత్ ఓటర్ కార్యక్రమం నిర్వహించి ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విజ్ఞతతో బాధ్యతాయుతంగా ఓటు వేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ షఫీ ఉల్లా తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కారేపల్లి: తెలంగాణ మోడల్ కళాశాలలో ఇంటర్ ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కారేపల్లి మోడల్ కళాశాల ప్రిన్సిపాల్ మహమ్మద్ అక్తర్ తెలిపారు. కారేపల్లిలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ.. 2024–25 విద్యాసంవత్సరంలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఇంగ్లీష్ మీడియంలో ప్రవేశాలకు పదోతరగతి పాసైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ విభాగాల్లో గ్రూపుకు 40 సీట్లు చొప్పున భర్తీ చేయటం జరుగుతుందన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టీఎస్‌మోడల్‌స్కూల్స్.కామ్ లో ఈ నెల 25గా అప్లై చేయాలన్నారు. రోస్టర్, పదోతరగతి మెరిట్ ఆధారంగా సీట్ల భర్తీ జరుగుతుందన్నారు.

1,246 పోస్టల్ ఓట్లు..

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి నియోజకవర్గానికి శుక్రవారం సాయంత్రంతో పోస్టల్ బ్యాలెట్ ఓట్లకు గడువు ముగిసింది. 1,442 ఓట్లకుగాను 1,246 ఓట్లు పోల్ అయ్యాయి. ఎసెన్షియల్ ఓట్లు 155కి 147 ఓట్లు పోల్ అయ్యాయి. 447 మంది హోం ఓటర్స్‌కు 438 ఓట్లు పోల్ అయ్యాయి. ఇతర పార్లమెంట్ నియోజకవర్గాలలో ఉన్న ఈ ప్రాంత ఉద్యోగులు 521 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్నట్లు ఆర్డీఓ సీహెచ్ రాజేంద్రగౌడ్ తెలిపారు.

ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలి

మధిరరూరల్: ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి ఈ నెల 12న ఉదయం 6 గంటలకు సత్తుపల్లి, పాలేరు, ఖమ్మం వెళ్లేందుకు బస్ సర్వీసులను ఏర్పాటు చేయాలని పీఆర్‌టీయూ నాయకులు కోరారు. ఈ మేరకు మధిర ఆర్టీసీ డిపో కార్యాలయంలో శుక్రవారం డిపో మేనేజర్ శంకర్ రావుని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రంగారావు, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఆర్ బ్రహ్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్మ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. 13న జరిగే ఎన్నికల సందర్భంగా సిబ్బంది ఒకరోజు ముందుగానే మధిర నుంచి బయలుదేరుతారని, కావున వారందరికీ స్పెషల్ బస్సులు ఏర్పాటు చేయాలని కోరగా.. డిపో మేనేజర్ సానుకూలంగా స్పందించారు.

వ్యక్తిపై పెట్రోల్ పోసి హత్యాయత్నం

ముదిగొండ: పాతకక్షల నేపథ్యాన ఓ వ్యక్తిపై పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటన ముదిగొండ మండలం మేడేపల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మేడేపల్లికి చెందిన పోగుల సైదులుకు హుజూర్‌నగర్‌కు చెందిన సుధాశ్రీతో 12ఏళ్ల క్రితం వివాహమైంది. గ్రామంలో గొడవల కారణంగా హుజూర్‌నగర్‌లో నివసిస్తున్న వారు సెలవుల్లో మేడేపల్లికి వస్తుంటారు. గ్రామంలో ఓ కార్యక్రమానికి హాజరయ్యేందుకు గురువారం వారు గ్రామానికి వచ్చారు. అయితే, గ్రామానికి చెందిన పోగుల నరసింహారావు, సైదులు మధ్య ఓ మహిళతో వివాహేతర సంబంధం విషయమై గొడవలు ఉన్న నేపథ్యాన, సైదులు శుక్రవారం ఫంక్షన్‌లో భోజనం చేస్తుండగా ఆయనపై నరసింహారావు పెట్రోల్ పోసి నిప్పంటించి పారిపోయాడు. దీంతో గ్రామస్తులు మంటలు ఆర్పి తీవ్రంగా గాయపడిన సైదులను ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై సైదులు భార్య ఫిర్యాదుతో హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు.

బహుజనులు రాజ్యాధికారం చేపట్టాలి

కారేపల్లి: బహుజనులు రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో రాజ్యాధికారం చేపట్టాలని మాలమహానాడు జిల్లానాయకుడు తలారి చంద్రప్రకాశ్ అన్నారు. శుక్రవారం కారేపల్లి అంబేడ్కర్ సెంటర్‌లో మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పోతుల విశ్వేశ్వరరావు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రప్రకాశ్ మాట్లాడుతూ.. పోతుల విశ్వేశ్వరరవు స్ఫూర్తితో బహుజనులు సంఘటితం కావాలన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు మండల అధ్యక్షులు సోమందుల రాములు, సాయి, చందూ, అనీల్, శ్రీనివాసరావు, యుగేందర్, వెంకటేశ్వర్లు, నరేష్, సురేష్, చంద్రశేఖర్, రఘుబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆరుబయటే డంపింగ్..

నిరుపయోగంగా వర్మీ కంపోస్ట్ షెడ్లు

- కొలిక్కిరాని చెత్త సమస్య
- తగలబెట్టి పూడ్చేస్తున్న వైనం..
- పొగతో అనారోగ్యం బారిన పడుతున్న ప్రజలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు


భీరపల్లిలో ఎన్‌ఎస్‌పీ కెనాల్‌పై తగలబెట్టిన చెత్తా చెదారం

ఇంటింట సేకరించిన చెత్త నుంచి సేంద్రియ ఎరువు తయారు చేయాలన్న లక్ష్యం నెరవేరడంలేదు. గ్రామాల్లో సేకరించిన చెత్తను ఆరుబయటే పారబోస్తూ నిప్పు పెట్టడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనారోగ్యం బారిన పడి ఆస్పత్రుల పాలవుతున్నామని అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని మండల ప్రజలు వాపోతున్నారు.

వేంసూరు: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు గ్రామ పంచాయతీలకు ఆదాయం పెంచాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన వర్మీ కంపోస్ట్ షెడ్లు నిరుపయోగంగా మారాయి. వీటి నిర్మాణానికి రూ. 2.50 లక్షలు ఖర్చు చేశారు. కాగా ఎరువుల తయారీ విషయంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో చెత్తకు నిప్పు పెడుతున్నారు. గ్రామ పంచాయతీ సిబ్బంది తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలన్న ఆదేశాలు ఉన్నా వాటిని ఎక్కడ అమలు చేసిన దాఖలాలులేవు.

అంతా ఒకే చోట..

గ్రామాల్లో సేకరించిన చెత్త చెదారంతో పాటు ప్లాస్టిక్ వస్తువులు, కూరగాయలు, ఇతర వ్యర్థాల నుంచి సేంద్రియ ఎరువులను తయారు చేయాల్సిన గ్రామ పంచాయతీ సిబ్బంది ఆరుబయట పారబోస్తూ తగులబెడుతున్నారు. భీరపల్లి గ్రామంలో ఎన్‌ఎస్‌పీ కాకర్ల మేయర్ కెనల్ వెంట బోసి తగుల పెట్టడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. శంబూనిగూడెం, చిన్నమల్లెల, వెంకటపురం, తదితర గ్రామాల్లో రోడ్డు వెంట చెత్తను పోసి తగులబెడుతున్నారు.

పొగ వ్యాపిస్తోంది..



గ్రామంలో చెత్తా చెదారాన్ని రోడ్లు, పంట కాలువలు, ఇళ్ల సమీపంలో వేసి కాలుస్తుండడంతో పొగ మొత్తం వ్యాపించి ఊపిరి పీల్చుకోవడం కష్టంగా మారుతుంది. దీనికి తోడు వ్యార్థాల నుంచి వచ్చే వాసనతో దోమలు వృద్ధి చెందుతుండటంతో అనారోగ్యం బారిన పడుతున్నాం.

– రఘునాథ రెడ్డి, అడసర్లపాడు

పట్టించుకోవడం లేదు..



చెత్తకు నిప్పు పెడుతుండటంతో రహదారుల పైకి పొగ వ్యాపిస్తుంది. పనులకు వెళ్లే రైతులు, కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. చెత్తను కంపోస్టు, డంపింగ్ యార్డుకు తరలించాలని అధికారులకు చెప్పిన పట్టించుకోవడంలేదు. జిల్లాస్థాయి అధికారులు దృష్టి సారించాలి.

– పర్స రాంబాబు, మర్లపాడు

చర్యలు తీసుకుంటాం..

పలు గ్రామాల్లో కొందరు ఎక్కడబడితే అక్కడ చెత్త వేస్తుంటారు. అలా చేయకూడదు. గ్రామాల్లో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డులకు తరలించాలని ఆదేశాలు ఉన్నాయి. తనిఖీలు చేపడతాం, కార్యదర్శులతో సమావేశం నిర్వహించి కంపోస్ట్ షెడ్లు, డంపింగ్ యార్డులకు తరలించేలా చర్యలు తీసుకుంటాం.

– రంజిత్ కుమార్, ఎంపీఓ, వేంసూరు

'బీజేపీ రాజ్యాంగాన్ని మారుస్తుంది'

– కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రఘురాంరెడ్డి


మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డి

మధిర: దేశంలో మరోసారి బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తారని ఖమ్మం పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మధిర స్విమ్మర్స్ అసోసియేషన్, కలయిక వాకర్స్ క్లబ్‌ను కలిసి ఓట్లు అభ్యర్థించారు. అనంతరం మధిర మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మిరియాల వెంకటరమణ గుప్తా అధ్యక్షతన నిర్వహించిన ముస్లిం సోదరుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. బీజేపీ మతతత్వ పార్టీ అని, నాయకులు బహిరంగంగానే ముస్లింలకు రిజర్వేషన్ తీసివేస్తామని ప్రకటిస్తున్నారని అన్నారు. బీఆర్‌ఎస్ ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్ ఇస్తానని.. గెలిచాక రిజర్వేషన్ మాటే ఎత్తలేదన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావాలని, రాహుల్ గాంధీని ప్రధానిగా చూడాలంటే తనకు ప్రతి ఒక్కరూ మద్దతు ఇచ్చి హస్తం గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్, జిల్లా కాంగ్రెస్ నాయకులు కోట రాంబాబు, ఐలూరి వెంకటేశ్వరరెడ్డి, యన్నం కోటేశ్వరరావు, దేవిశెట్టి రంగారావు, వేమిరెడ్డి లక్ష్మారెడ్డి, రంగా హనుమంతరావు, టీవీ రెడ్డి, పాటిబండ్ల సత్యంబాబు, నిడమానూరి వంశీకృష్ణ, దారా బాలరాజు, అద్దంకి రవికుమార్, దుంపా వెంకటేశ్వర రెడ్డి, షేక్ జహంగీర్, షేక్ ముజాహిద్, సాదిక్, మెహబూబ్, నూర్ మొహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

రఘురాంరెడ్డికి కృష్ణారెడ్డి మద్దతు


రఘురాంరెడ్డితో తుంబూరు కృష్ణారెడ్డి

సత్తుపల్లి: ఎంపీటీసీ సంఘం జిల్లా కార్యదర్శి, కిష్టాపురం ఎంపీటీసీ తుంబూరు కృష్ణారెడ్డి బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసి రామసహాయం రఘురాంరెడ్డిని శుక్రవారం కొత్తగూడెంలో తన అనుచరులతో కలిసి మద్దతు ప్రకటించారు. రమసహాయం గెలుపునకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ఆయన వెంట బండి లింగారెడ్డి, చిలుకూరి సుబ్బారెడ్డి, కొప్పుల రవీంద్రారెడ్డి, కొండేటి వెంకటేశ్వరరావు, దేశిరెడ్డి వెంకటసత్యనారాయణరెడ్డి, మలిరెడ్డి పూర్ణచంద్రారెడ్డి, గాదిరెడ్డి రాంబాబురెడ్డి, సోముల సత్యనారాయణ, వినుకొండ సూర్యం, దరావత్ వెంకట్రావ్, నాయుడు రాఘవరావు, ఈడా శ్రీనివాసరావు ఉన్నారు.

రాజీనామా

కల్లూరు: మండలంలోని కొర్లగూడెం సొసైటీ చైర్మన్ కీసర వెంకటేశ్వరరెడ్డి, మాజీ సర్పంచ్ బైరెడ్డి నరసింహారెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ పామర్తి కృష్ణ (సిద్దు), కొర్లగూడెం, నారాయణపురం పంచాయతీ మాజీ వార్డు సభ్యులు, గ్రామశాఖలు శుక్రవారం బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా కల్లూరులోని కీసర వెంకటేశ్వరరెడ్డి గృహంలో వారు విలేకరులతో మాట్లాడుతూ.. కార్యకర్తల మనోభావాలకు అనుగుణంగా బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసినట్లు పేర్కొన్నారు. కొర్లగూడెం, నారాయణపురం గ్రామాల అభివృద్ధికి సహకరించే పార్టీకి తమ మద్దతు ఉంటుందన్నారు. కార్యక్రమంలో వేణు, నారాయణపురం వార్డు సభ్యులు, గ్రామశాఖ అధ్యక్షుడు రవి, రామకృష్ణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సాయిస్ఫూర్తిలో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్

సత్తుపల్లిరూరల్: గంగారం సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం హైదరాబాద్ అడ్వైజర్స్ టెక్నాలజీస్‌వారిచే క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. కళాశాలలో బీటెక్ ఫైనల్‌ఇయర్ చదువుతున్న అన్ని బ్రాంచ్‌ల విద్యార్థులు హాజరయ్యారు. ఇంటర్వ్యూ, గ్రూప్ డిస్కర్షన్, టెక్నికల్ రౌండ్, హెచ్‌ఆర్ ఇంటర్వ్యూ ద్వారా 17 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కంపెనీ ప్రతినిధులు టి.ఆదిత్యకుమార్, మేనేజర్ ఎండి షబ్బా ఫాతిమ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను రాజ్యసభ సభ్యులు, హెటిరో చైర్మన్ డాక్టర్ బండి పార్థసారథిరెడ్డి, అన్విద వర్చువల్‌గా అభినందించారు. అదే విధంగా కళాశాల సెక్రటరీ ప్రభాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శేషారత్నకుమారి తదితరులు అభినందించారు.

ఆర్థిక సాయం

ముదిగొండ: మండలపరిధిలోని బాణాపురానికి చెందిన గీతకార్మికుడు మరికంటి నాగేశ్వరరావు ఇటీవల తాటిచెట్టుపై నుంచి పడి మృతిచెందాడు. ఆయన కుటుంబాన్ని జాగృతిట్రస్ట్ వ్యవస్థాపకుడు ప్రముఖ వైద్యుడు డాక్టర్ రాజశేఖర్‌గౌడ్ శుక్రవారం పరామర్శించి.. నాగేశ్వరరావు కుటుంబానికి ట్రస్ట్ నుంచి రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో గౌడ సంఘం సొసైటీ చైర్మన్ మరికంటి వీరబాబు, సంఘం ప్రతినిధులు శ్రీనివాసరావు, రామలింగం, వెంకట్, విజయ్‌బాబు, వెంకట్, హనుమంతరావు, నరేష్, వెంకటేశ్వర్లు, రాంబాబు, సత్యనారాయణ, బాబు పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం


ఎమ్మెల్యే మట్టా రాగమయిని సన్మానిస్తున్న బొందయ్య

సత్తుపల్లి: అన్ని వర్గాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమౌతుందని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. శుక్రవారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి ఎస్సీసెల్ బాధ్యుల సమావేశంలో జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బి.బొందయ్యతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం దళిత డిక్లరేషన్ ఇచ్చిందని, బీజేపీ ప్రభుత్వం ఉన్న రిజర్వేషన్లు తీసేస్తామంటుంటే మందాకృష్ణ మాదిగ ఏ విధంగా ఆ పార్టీకి మద్దతు ఇస్తున్నారో అర్థం కావటం లేదని విమర్శించారు. సమావేశంలో గాదె చెన్నారావు, ఐ.శ్రీను, ఎండి కమల్‌పాషా, అలవాల కరుణాకర్, చల్లగుళ్ల నర్సింహారావు, ఆనంద్ పాల్గొన్నారు.

మతోన్మాద శక్తులను ఓడిద్దాం..

ఏన్కూరు: మతోన్మాద శక్తులకు ఓడించాలని సీపీఐ వైరా నియోజకవర్గ కార్యదర్శి ఎర్రబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన సీపీఐ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వామపక్ష ప్రజాతంత్ర లౌకిక శక్తులు బలపరిచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డిని అత్యంత మెజారిటీలో గెలిపించాలని కోరారు. మరోసారి బీజేపీకి అవకాశం కల్పిస్తే దేశంలో రిజర్వేషన్లు రద్దు చేస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి జాగర్లమూడి రంజిత్‌కుమార్, అమరనేని వీరభద్రం, మేడ భూషయ్య, మాదినేని వెంకన్న, నగదరావు, బసవయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ వైపే మాదిగలు..

మధిర: మాదిగలు ఎప్పుడు కాంగ్రెస్ వైపే ఉంటారని జిల్లా కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ కోట రాంబాబు తెలిపారు. శుక్రవారం మధిర మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ కల్లబొల్లి మాటలకు మాదిగ జాతి పెద్దలు జాతిని తాకట్టు పెట్టడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. మాదిగలంతా హస్తంగుర్తుకు ఓటు వేయాలన్నారు. సమావేశంలో రమేష్, రామారావు, ప్రసాద్, శ్యామలరావు, డేవిడ్, పుల్లారావు, డేవిడ్, రమేష్, సత్యానందం తదితరులు పాల్గొన్నారు.

రఘురామిరెడ్డి గెలుపుకు యాదవులు కృషి చేయాలి..

ఎర్రుపాలెం: రఘురాంరెడ్డి విజయానికి కురుమ యాదవులు కృషి చేయాలని డీసీసీబీ డైరెక్టర్, అఖిల భారత యాదవ మహాసభ జిల్లా గౌరవ అధ్యక్షుడు మేకల మల్లిబాబు యాదవ్ కోరారు. శుక్రవారం మండలకేంద్రంలో మొగిలి అప్పారావు అధ్యక్షతన నిర్వహించిన యాదవుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటనారాయణ, నాగరాజు, కృష్ణ, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, తిరుపతిరావు, రేఖా శ్రీనివాసరావు, శంకర్ తదితరులున్నారు.

బీజేపీని ఓడించడమే కమ్యూనిస్టుల లక్ష్యం


సింగరాయపాలెంలో ఉపాధి పనుల వద్ద ప్రచారం చేస్తున్న సీపీఎం, కాంగ్రెస్ నాయకులు

కొణిజర్ల: మతోన్మాద బీజేపీని ఓడించడమే కమ్యూనిస్టుల ప్రధాన లక్ష్యమని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు భూక్యా వీరభద్రం అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ.. మండలంలోని సింగరాయపాలెంలో శుక్రవారం సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలను కలిసి ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు దొడ్డపనేని కృష్ణార్జునరావు, మిద్దె రామారావు, షేక్ అఫ్జల్, ఖాసీమ్‌బేగ్, మట్టా వెంకటేశ్వర్లు, కాటేపల్లి సీతారామయ్య, సురభి వెంకటేశ్వర్లు, అనుమోలు ప్రసాద్, ముత్తారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల హక్కులను కాలరాస్తున్న బీజేపీ

కారేపల్లి: కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డిని గెలిపించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండెబోయిన నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండలంలోని ఉసిరికాయలపల్లిలో ఉపాధి కూలీలను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ అవకాశవాద విధానాలను తిప్పికొట్టాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బన్సీలాల్, సీపీఎం నాయకులు మల్లయ్య, సైదులు, కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, బన్సీలాల్, శంకర్, రవి పాల్గొన్నారు.

మోడల్ పోలింగ్ కేంద్రాలు రెడీ



వైరాలోని మహిళా పోలింగ్ కేంద్రం

వైరా: పార్లమెంట్ ఎన్నికలకు అధికారులు చకచకా ఏర్పాట్లు చేస్తున్నారు. పోలింగ్ కేంద్రాలలో సౌకర్యాలతో పాటుగా.. సమాచార కేంద్రాలు ఏర్పాట్లు చేస్తున్నారు. అందులో భాగంగా వైరా నియోజకవర్గ కేంద్రంలో మూడు ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. స్థానిక గుట్టబడి సీపీఎస్‌లోఆదర్శ యువకుల పోలింగ్ కేంద్రం, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదర్శ మహిళా పోలింగ్ కేంద్రం, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదర్శ దివ్యాంగుల పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అధికారుల పొరపాటు వల్ల మహిళా పోలింగ్ కేంద్రానికి ఉండాల్సిన స్వాగత బోర్డు దివ్యాంగుల పోలింగ్ కేంద్రానికి.. దివ్యాంగుల కేంద్రానికి ఏర్పాటు చేయాల్సిన బోర్డును మహిళా పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేశారు. దీంతో అధికారుల పొరపాటును పలువురు చర్చించుకుంటున్నారు.

ఈవీఎంలు సిద్ధం..


సత్తుపల్లిలోని స్ట్రాంగ్‌రూం

సత్తుపల్లిటౌన్: ఈ నెల 13న జరగనున్న పార్లమెంట్ ఎన్నికలకు ఈవీఎంలు సిద్ధమయ్యాయి. సత్తుపల్లి నియోజకవర్గంలో 294 పోలింగ్ కేంద్రాలు పోలింగ్ నిర్వహణ కోసం 364 కంట్రోల్ యూనిట్లు, 411 వీవీ ప్యాట్లు, 1099 బ్యాలెట్ యూనిట్లను కమిషనింగ్(బ్యాలెట్ పత్రాలు పెట్టడం) పూర్తి చేశారు. ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసి మాక్‌పోలింగ్ ఘటాన్ని నిర్వహించారు. నియోజకవర్గాన్ని 13 రౌండ్లుగా ఏర్పాటు చేశారు. అంతా సజావుగా ఉన్న ఈవీఎం యంత్రాలను అందరి సమక్షంలో సీల్ చేశారు. ఇలా సీల్ వేసిన వాటిని స్థానిక జ్యోతి నిలయం పాఠశాలలోని స్ట్రాంగ్‌రూంలో భద్రపరిచి.. సాయుధ బలగాలతో భద్రత ఏర్పాటు చేశారు. ఈ నెల 12న పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సిబ్బంది, ఈవీఎం యంత్రాలు చేరతాయి. ఇందుకోసం 28 రూట్లు ఏర్పాటు చేశారు. రూట్ల వారీగా 28 సెక్టార్ ఆఫీసర్ల పర్యవేక్షతో ఈ నెల 13వ తేదీన సాయంత్రం 6 గంటలకు పోలింగ్ ముగిశాక ఖమ్మంలోని పొన్నేకల్‌లో గల కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలోని రిసెప్షన్ కేంద్రానికి పటిష్ట భద్రతతో తరలిస్తారు.

ఒక్క అవకాశం ఇవ్వండి


మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు

సత్తుపల్లిటౌన్: ఈగడ్డ బిడ్డను.. ఖమ్మంపార్లమెంట్ అభివృద్ధి కోసం ఒక్క అవకాశం ఇవ్వండి.. మీలో ఒకడిగా కలిసి పనిచేస్తానని బీజేపీ ఖమ్మం అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు అన్నారు. సత్తుపల్లిలో శుక్రవారం రాత్రి రోడ్‌షో నిర్వహించి రింగ్‌సెంటర్‌లో జరిగిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. మోదీ నేతృత్వంలో దేశం అభివృద్ధి చెందుతుందని, ఈ ప్రాంతం అభివృద్ధి కోసం రాజకీయాలకు అతీతంగా ఆశీర్వదించాలని కోరారు. పామాయిలల్ బోర్డు, ఐటీ ఇండస్ట్రీ ఈ ప్రాంతానికి అవసరమని ఇవ్వన్నీ ఖమ్మంలో బీజేపీ గెలిస్తేనే సాధ్యమౌతాయన్నారు. కార్యక్రమంలో ఖమ్మం పార్లమెంట్ ఇన్‌చార్జ్ నంబూరి రామలింగేశ్వరరావు, నాయుడు రాఘవరావు, పాలకొల్లు శ్రీను, సుదర్శన్ మిశ్రా, టీడీపీ నాయకులు పోట్రు రామారావు, జనసేన నాయకులు శరత్ పాల్గొన్నారు.

బీజేపీ ఇంటింట ప్రచారం


అంజనాపురంలో ప్రచారం చేస్తున్న నాయకులు

తల్లాడ: మండలంలోని పినపాక, బిల్లుపాడు, గోపాలపేట, నరసింహారావుపేట, బాలపేట, లక్ష్మీపురం, మిట్టపల్లి గ్రామాల్లో బీజేపీ, టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం ఇంటింట ప్రచారం నిర్వహించారు. కమలం పువ్వు గుర్తుకు ఓటేసి.. బీజేపీ అభ్యర్థి వినోద్‌రావును గెలిపించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ తల్లాడ మండల అధ్యక్షుడు ఆపతి వెంకటరామారావు, నాయకులు నాగులు, బాలాజీ నాయక్, కృష్ణారావు, రమేష్, సుధాకర్, నరసింహారావు, రామారావు, మాదవరెడ్డి, రవితేజ, వెంకటనారాయణ పాల్గొన్నారు.

యువమోర్చా ఆధ్వర్యంలో..

బోనకల్: మండల కేంద్రంలో యువమోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా యువమోర్చా నాయకుడు తాళ్లూరి సురేష్ మాట్లాడుతూ.. ఈ నెల 13న జరిగే ఎన్నికలలో బీజేపీకి ఓటు వేయాలని.. మూడో సారి మోదీని ప్రదాని చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బిక్షపతి, రవి, పరుశురాం, వెంకటేశ్వర్లు, పాపారావు, నాగయ్య పాల్గొన్నారు.

మరోమారు నామాను గెలిపించండి


ఎర్రుపాలెం: కండ్రికలో ప్రచారం చేస్తున్న నామా తనయుడు పృథ్వీతేజ్, నాయకులు

సత్తుపల్లిటౌన్/ఎర్రుపాలెం: కారు గుర్తుపై ఓటేసి మరోమారు నామా నాగేశ్వరరావుని గెలిపించాలని ఆయన తనయుడు నామ పృథ్వీతేజ్ కోరారు. శుక్రవారం రాత్రి సత్తుపల్లి పట్టణంలో షాప్‌టూషాప్ ప్రచారం నిర్వహించారు. అదే విధంగా ఎర్రుపాలెంలోని జమలాపురం,కండ్రిక, బంజర, నర్సింహాపురం, తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. తొలుత జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయంలో శ్రీవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. సొసైటీ అధ్యక్షుడు ముల్పూరి శ్రీనివాసరావు నివాసంలో పార్టీ కార్యకర్తలు, నాయకులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, చల్లగుండ్ల కృష్ణయ్య, కొత్తూరు ఉమామహేశ్వరరా వు, అంకమరాజు, ఎస్‌కె రఫీ, ఎస్‌కె చాంద్‌పాషా, నరుకుళ్ల శ్రీను, మధిర వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ చావా రామకృష్ణ, జెడ్పీటీసీ కవిత, పార్టీ మండల అధ్యక్షులు సాంబశివరావు, నాయకులు రామకోటేశ్వరరావు, హరీష్‌బాబు, కృష్ణారావు, భాస్కర్ రెడ్డి, కిషోర్, మస్తాన్‌వలీ, నరేందర్ రెడ్డి, నరసింహారావు, నాగేశ్వరావు, కాశేశ్వరరావు, లోకేశ్వరరావు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్మన్ లింగాల ఆధ్వర్యాన..

ముదిగొండ: నామా నాగేశ్వరరావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని జెడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజు కోరారు. శుక్రవారం మండలంలోని కమలాపురం, వల్లబి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్ర వెంకన్న, లక్ష్మారెడ్డి, తిరుమలరావు, శ్రీనివాసరావు, ధనమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఇండియా కూటమిని గెలిపించాలి



కొణిజర్ల: మాట్లాడుతున్న రమేష్

కల్లూరు: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమిని గెలిపించాలని కోరుతూ సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ఆధ్వర్యంలో శుక్రవారం కల్లూరులో కరపత్రాలు ఆవిష్కరించారు. కల్లూరుటౌన్ కార్యదర్శి జె.మాల్యాద్రి మాట్లాడుతూ.. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్, ఎన్‌డీఏ కూటమిని ఓడించాలన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి ఖమ్మంపాటి పుల్లారావు, హమాలీ సంఘం నాయకులు ఏడు కొండలు, వెంకట్రావు, వీరయ్య, సుల్తాన్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

కొణిజర్ల: ఇండియా కూటమి అభ్యర్థుల గెలుపుతోనే రైతులకు న్యాయం జరుగుతుందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్ అన్నారు. కొణిజర్ల దొండపాటి భవన్‌లో శుక్రవారం నిర్వహించిన ఉమ్మడి రైతు సంఘాల సంయుక్త సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతులకు సరైన న్యాయం జరగాలంటే బీజేపీని ఓడించి తీరాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు పాశం అప్పారావు, భూక్యా వీరభద్రం, తాళ్లపల్లి కృష్ణ, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, సొసైటీ ఉపాధ్యక్షుడు నెల్లూరి రమేష్, తండు సోమయ్య,తోటపల్లి సీతారాములు, పారుపల్లి శ్రీనాద్, తాతా వెంకయ్య, కొమ్మినేని వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

వైరారూరల్/ముదిగొండ: వైరా మండలంలోని గొల్లపూడి వృద్ధాశ్రమలోని వృద్ధులకు శుక్రవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, నందిని దంపతుల 29వ వివాహ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకొని వైరా వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, కాంగ్రెస్ నాయకులు పసుపులేటి మోహన్‌రావు అన్నదానం చేశారు. అదే విధంగా ముదిగొండలోని వల్లబిలో యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బిచ్చాల అన్వేష్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఉపాధి కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు పల్లపు కొండలు, ఇజ్జగాని సత్యనారాయణ, ఇక్కుర్తి ఉపేందర్‌రావు, పాల నర్సింహారావు, విజయ, చంద్రకళ మాధవరావు, రమేష్, రాకేష్, సంగీతరావు, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.